ఏమిటా కాగితం? అలా మడతలు పెట్టి ఎందుకిస్తున్నాడు? అందులో ఏమి రాశాడు? ఒకవేళ ....ఒకవేళ ప్రేమలేఖా? మొదటి నుంచే అతను తనతో అదోలా ప్రవర్తిస్తున్నాడు. చనువుగా కొంచెం అతిగా .....మాట్లాడుతు......

అతను మళ్ళీ సైగ చేశాడు కాగితం తీసుకుని వెళ్ళమన్నట్లు.

ఆమె కాగితం తీసుకుంది. ఆమెకు అయిష్టంగా వుంది. రహస్యంగా ఏదో కానిపని చేస్తున్న ఫీలింగ్........త్వర త్వరగా గదిలోంచి బయటకు నడిచి తన సీట్లో కూర్చుంది.

నెమ్మదిగా కాగితం విప్పి చదవసాగింది.

"ప్రత్యూషా! దయచేసి ఈ అడ్రస్‌కెళ్ళి తులసి అనే అమ్మాయి క్షేమసమాచారాలు తెలుసుకుని రా! సురేష్ క్షేమంగానే వున్నాడని ఆమెకు చెప్పు! ఈ విషయం సురేష్ స్నేహితుడొకతను దుబాయ్ దేశం నుంచి వస్తూ చెప్పాడని చెప్పు. అంతకన్నా వివరాలు మనాఫీసులో కూడా ఎవరికీ తెలీకూడదు. చాలా సీక్రెట్! తులసి హాపీగా వున్నట్లయితే రేపు ఆఫీస్‌కి రాగానే "వెరీ గుడ్‌మాణింగ్ సర్" అను.
ఏమయినా ప్రాబ్లెమ్ వుంటే "గుడ్‌మాణింగ్ సర్" అను! నేను అర్థం చేసుకుంటాను దయచేసి ఆ ఉత్తరం చింపెయ్ కొంగా! ప్రత్యూషా నా కోసం యీ సహాయం చెయ్"

ఆమె ఆఖరి లైన్ చదువుతూనే వులిక్కిపడింది.

కొంగ! తన నిక్‌నేమ్! అది ఇతనికెలా తెలిసింది. ఏనాడో హైస్కూల్లో తనకు పెట్టిన నిక్‌నేమ్- ఇంత పెద్ద కోటీశ్వరుడికి తెలీటం ఎలా సాధ్యం ? అతను తన క్లాస్‌మేట్ కాదు తెలీటానికి. క్లాసులో అంతా ఆడపిల్లలే వుండేవారు. తనీ నిక్‌నేమ్ విషయం ఎవరికీ చెప్పిన గుర్తులేదు. ఒకే ఒక్క సురేష్‌కి తప్ప!

అవును సురేష్ తన బాస్‌కెలా తెలుసు? సురేష్ నిజంగానే దుబాయ్‌లో వున్నాడా? ఉంటే ఇంత రహస్యం ఏమిటి? బయటకు తెలిస్తే ఏమిటీ నష్టం? ఏదో రహస్యం వుండే వుంటుంది.

కాగితం మీద అడ్రస్ వరకు కట్ చేసుకుని మిగతా ఉత్తరం ముక్కలు ముక్కలుగా చింపి బాత్ రూమ్‌లోని సింక్‌లో పడేసిందామె.

విష్ణు సురేష్ గదిలోకొచ్చాడు. ప్రత్యూషతో సురేష్ మాట్లాడిన మాటలు అతనికి అనుమానం కలిగిస్తున్నాయ్. చటుక్కున టేబుల్ మీద వున్న ఫైలూ, వేస్ట్ పేపర్ బాస్కెట్, సొరుగులు అన్నీ త్వరత్వరగా వెతికాడు. ఏమీ కనిపించటం లేదు.

"ఏమిటి వెతుకుతున్నావు?" కోపంగా అడిగాడు సురేష్.

"ప్రత్యూషతో నీకు మాటలెక్కువయాయ్ అందుకని "

"మైండ్ యువర్ బిజినెస్" కోపంగా అరిచాడు సురేష్.

అతనికిప్పుడు ధైర్యంగా వుంది. మాధురి ప్రస్తుతానికి తన ప్రియురాలు కనుక తనింకెవ్వరినీ లెక్కచేయనక్కర్లేదు.

"అదే చేస్తున్నాను" అన్నాడు విష్ణు.

"మర్యాదగా బయటికెళ్ళు నీ ఎలుగుబంటి ముఖం చూడటం నాకసహ్యం"

విష్ణు ముఖంలో క్రూరత్వం వచ్చేసింది.

"జాగ్రత్తలు మాటలు కంట్రోల్ చేసుకో" ఆవేశంగా అన్నాడు.

"గెటౌట్ " శక్తి కొద్దీ గట్టిగా అరిచాడు.

విష్ణు ఆ కేకకు నిశ్చేష్టుడయిపోయాడు. సెక్యూరిటీ గార్డ్ స్టెన్ గన్తో వేగంగా లోపలి కొచ్చాడు.

"ఏం జరుగుతోంది?" విష్ణు వైపు చూస్తూ అడిగాడతను.

"ఏమీ లేదులే- పద" అన్నాడు స్పృహలోకొస్తూ.

ఇద్దరూ గది బయటికెళ్ళిపోయారు. సురేష్ కుర్చీలో కూర్చుని వెనక్కు జారగిల పడ్డాడు. తనను కనిపెట్టి వుండడానికి చాలా ఏర్పాట్లు చేశారు. ఇంత కట్టు దిట్టమైన బందోబస్తు నుంచి తప్పించుకు పారిపోవటం సామాన్యమైన విషయం కాదు. కానీ ప్రయత్నించాలి. ఎలా? ఆలోచనలు ఒకదాని వెనుక ఒకటి తరుముకొస్తున్నాయ్.

చాలా సేపటి తర్వాత హఠాత్తుగా తట్టింది. ఒక్క ఉదుటున కుర్చీలోనుంచి లేచి నిలబడ్డాడు. చాలా ఎగ్జయింట్గా వుందా ఆలోచన. గుండె ఆనందంతో వేగంగా కొట్టుకుంటోంది. అద్భుతమైన ఉపాయం అది. తను తప్పించుకోవాలంటే అదొక్కటే సురక్షితమయిన మార్గం. ఇవాళ రాత్రికే జరగాలి.

మాధురి తన గదిలోకొచ్చి వెళ్ళాక..... తనూ ఆమె వెనకే వెళ్ళి ఆమె గదిలో చేరుకుని ఆమెకు నిద్ర పట్టేవరకూ పొంచి వుండి అర్జున్కు స్పృహ తప్పేలా నెత్తి మీద కొట్టాలి. తరువాత అతనిని తన గదిలోకి ఈడ్చుకొచ్చి తన పక్క మీద పడేసి తను వెళ్ళి మాధురి పక్కనే అర్జున్ స్థానంలో పడుకోవాలి. అంతే! ఆ తరువాత తనకు స్వాతంత్ర్యం వచ్చేసినట్లే. తనెక్కడికి వెళ్ళాలన్నా అడ్డగించే వారెవరూ ఉండరు. ఒకసారి బయటి ప్రపంచంలో బయటి జనప్రవాహంలో కలిసిపోతే చాలు. ఇంక తను భగవంతుడికి కూడా దొరకడు. తనకున్న డబ్బు తులసే సర్వస్వంగా అజ్ఞాతవాసం చేస్తాడు. మిగతా జీవితకాలమంతా అర్జున్ని తన గదిలో చూసి అంతా తనే అనుకుంటారు . అతను కాదని ఎంత మొత్తుకున్నా వినిపించుకోరు. అతను వాళ్ళ మాటలు వినిపించుకోనందుకు..... చివరకు హత్య గావింపబడతాడు. అది మళ్ళా కారు ప్రమాదంగా చిత్రీకరింపబడుతుంది. అయినా అతని సంగతి తనకి అనవసరం. తను

ముందు యిక్కడి నుంచి బయట పడాలి.

రాత్రి ఎప్పుడవుతుందా అని ఆతృతగా ఎదురు చూడసాగాడతను. అర్థరాత్రి పన్నెండు గంటలకు వచ్చిందామె. దగ్గరకు వస్తూనే అమాంతం ఆమెను కౌగిట్లోకి లాక్కున్నాడతను. ప్రణయ ఉధృతానికి మాధురి ఆశ్చర్యపోయింది.

"సురేష్ ! నిన్ను వదిలి వుండలేను సురేష్ ! శాశ్వతంగా నువ్వు నాక్కావాలి" అంటోంది అతనితోపాటు మెలికలు తిరిగిపోతూ.

ఇద్దరూ మామూలు స్థితి కొచ్చేసరికి రెండు గంటలయింది.

అతను ఆమెనే గమనిస్తున్నాడు. తన గదిలోనే నిద్రపోతే తనకు చాలా తేలికవుతుంది.

మరికొద్ది క్షణాల్లో గాఢనిద్రలో మునిగిపోయింది.

అతను నెమ్మదిగా లేచి మంచం దిగి మాధురి గది ద్వారం వైపు నడిచాడు. తలుపు తెరచి అవతలి గదిలోకి అడుగుపెట్టాడు. గది ఖాళీ......మంచం మీద ఎవరూ లేరు.

అతను ఆశ్చర్యపోయాడు,

"అర్జున్ ఏమైనట్లు?"

ఆ గదికున్న మరో తలుపు లోపల్నుంచి బోల్ట్ వేసి వుంది.

నెమ్మదిగా బోల్ట్ తీసి తలుపు తెరచి చూశాడు. ఎదురుగా సన్నని నడవా డిమ్‌లైట్సులో మసగ్గా కనబడుతోంది. దూరంగా ఓ గదిలో లైట్లు వెలుగుతున్నాయి.

ఒక వేళ అక్కడ వున్నాడా అర్జున్?

చప్పుడు కాకుండా గోడనానుకుని ఆ గది వైపు నడవసాగాడతను. అంతా నిశ్శబ్దంగా వుంది. ఆ గది దగ్గర మాత్రం ఎవరిదో గురక వినబడుతోంది.

గదికి సమీపంగా వచ్చాక చూశాడు. చేతిలో గన్‌తో ఒక సెక్యూరిటీగార్డ్ నిద్రపోతున్నాడు కుర్చీలో. అతనిని దాటి నెమ్మదిగా కిటికి దగ్గరకు నడిచాడు. లోపలకు తొంగి చూస్తూనే ఉలిక్కిపడ్డాడు. అర్జున్ మంచం మీద పడుకుని నిద్రపోతున్నాడు. అతని చేతిని స్తంభానికి కట్టి వేసిన గొలుసు. గుండె కొట్టుకోసాగింది అతనికి.

అర్జున్ నెందుకు బంధించారు?

అతను నిజంగాను పిచ్చివాడయ్యాడా?

హఠాత్తుగా వెర్రికేక వినిపించింది బిగ్గరగా. సురేష్ కాళ్ళూ చేతులూ వణికిపోయినయ్. సెక్యూరిటీగార్డ్ హడావుడిగా లేచి కిటికి దగ్గరకు పరుగెత్తి లోపలకు చూశాడు. గోడకానుకుని కూర్చుండిపోయాడు అతను.

"ఏమిటి కేక! ఏం జరిగింది?" అన్నాడు కఠినంగా.

అర్జున్ లేచి మంచం మీద కూర్చున్నాడు.

"నన్నొదిలేసెయ్యండి! నన్నొదిలేసెయ్యండి " పిచ్చివాడిలా మట్లాడుతున్నాడు.

"మాట్లాడకుండా పడుకో" మళ్ళీ అరిచాడు సెక్యూరిటీగార్డ్ .

అర్జున్ తనలో తాను గొణుక్కోవటం స్పష్టంగా వినిపిస్తోంది. కొద్దిసేపటి తర్వాత సెక్యూరిటీ గార్డ్ సిగరెట్ వెలిగించుకుని నడవాలో నుంచి ముందుకువెళ్ళి బాత్ రూమ్ తలుపు తెరచి లోపలికి నడిచాడు.

అతను వెంటనే వడివడిగా అడుగులు వేసుకుంటూ తన గదివేపు బయల్దేరాడు. రెండు గదులు దాటేసరికి మూడో గది తలుపు హఠాత్తుగా తెరచుకుంది, లోపల లైటు దేదీప్యంగా వెలుగుతోంది. లోపలి దృశ్యం చూసి షాక్ తిన్నట్లయి నిలబడి పోయాడు.
ఎదురుగ్గా ఓ యువతి. బహుశా పాతికేళ్ళ వయసుంటుందేమో గది మధ్యలో కుర్చీలో కూర్చుని వుంది. జుట్టు ముడివేసుకుని అందవిహీనంగా వుంది, ముఖంలో ఏ భావమూ కనిపించటం లేదు.

"రా! నీ కోసమే చూస్తున్నాను" అంది సన్నని గొంతుతో.

అతని గొంతు తడారిపోయింది.

గదిలోకి నడిచి ఆమె కెదురుగ్గా నిలబడ్డాడు.

"మాధురి ఏం చెప్పింది నీతో?" అడిగిందామె తీక్షణంగా .

"......ఏ విషయం ?" గొంతు పెగల్చుకుని అడిగాడు.

"నా విషయం......."

"మీరెవరో నాకు తెలీదు"

ఆమె కొద్ది క్షణాలు మౌనంగా వుండిపోయింది.

"ఇదంతా మాధురి చేస్తోంది. నాకు తెలుసు" అందామె తనలో తాను మాట్లాడుకుంటున్నట్లు.

అతనికి అంతా అగమ్యగోచరంగా వుంది.

"నేను అర్జున్ భార్యను"

పక్కలో బాంబు పేలినట్లు అదిరిపడ్డాడు.

"మీరు ......మరి మాధురి..........?

"నా సంసారాన్ని సర్వనాశనం చేయటానికి వచ్చిన రాక్షసి" హఠాత్తుగా ముఖాన్న చేతులుంచుకుని రోదించసాగింది. అతనికేం చేయటానికి తోచటం లేదు.

గదిలోనుంచి పారిపోవాలని వుంది.

ఆమె ఏడుపు ఆగిపోయింది. కుర్చీలోనుంచి లేచి అటూ ఇటూ పచార్లు చేయసాగింది.

“ఇదుగో! నీకు ముందే చెప్తున్నాను. నిన్ను అది చంపేస్తుంది జాగ్రత్త! ఎక్కువ రోజులు లేవు. వారమో, పదిరోజులో అంతే! అప్పటితో నీ అవసరం తీరిపోతుంది... ” ఆమె మాటలు వింటూనే అతనికి వణుకు మొదలయింది.

ఆమె నెమ్మదిగా అతని దగ్గర నిలబడింది.

“నువ్వు బ్రతికి బయట పడాలంటే ఒకే ఒక్క మార్గముంది” అంది రహస్యంగా గొంతు తగ్గించి . అతను పాలిపోయిన ముఖంతో ఆమె వేపు చూశాడు.

“మనిద్దరం కలిసి చంపేయాలి, అంతే ఇద్దరికీ శని వదిలి పోతుంది.......”

అతను నిశ్చేష్టుడయిపోయాడు.

“మాట్లాడవేమిటి? ఇదే ఆఖరి అవకాశం. తరువాత ఏం చేయాలనుకున్నా అలస్యమయిపోతుంది” హెచ్చరించిందామె.

అతను రెండడుగులు వెనక్కు వేశాడు. “నాకు అలవాటు లేదు ఇలాంటివి. నేను చంపలేను” అన్నాడు తడబడుతూ.

ఆమె భయంకరంగా నవ్వింది.

“దీనికి అలవాటుండక్కర్లేదు... రోజూ రాత్రి నీగది కొస్తూంటుంది కదా! ఈ పౌడర్ ఆమె నాలుకకు అంటుకునేలా చెయ్ అంతే. కొద్ది సెకండ్లలో జరిగిపోతుందంతా”

ఆమె చేతిలో చిన్న ప్లాస్టిక్ బాటిల్ కనిపించింది. అతని చేతిలో పెట్టింది దాన్ని. అతని చేయి వణుకుతోంది. చేయి అంతా విద్యుత్ ప్రవహిస్తోన్నట్లుంది.

“ఇంక వెళ్ళు! రేపే పని పూర్తిచేయ్ .....ఆలస్యమయితే ఆ తర్వాత నువ్వే వుండవ్ .......గుర్తుంచుకో........”